పెన్షను పుచ్చుకున్న నాటి రాత్రి

డెప్యూటీ కలెక్టరు రాజేశ్వరరావు పంతులుగారు తాము పెన్షను పుచ్చుకునే కాలం సమీపిస్తున్నందున నరసిన తలకు నల్ల రంగు పూసుకొని, తొస్సెనోటికి పండ్లు పెట్టించుకొని తమ ఉద్యోగ కాలం మఱి రెండేండ్లు పొడిగించుకోడానికి నానా పాట్లుపడ్డారు. కాని లాభించలేదు. ఉన్నట్టుండి ఒక్కనాడు "మీరీ నెలాఖరునుంచి పెన్షను పుచ్చుకోవలసిం"దని ఆర్డరు వచ్చింది. పిట్టపిడుగులాగ వచ్చిన ఆ ఉత్తరువు చూచుకొని రాజేశ్వరరావుగారు నిర్విణ్ణులై పోయినారు "ఛీ ఎంత మేపితేనేమి. ఈ అధికారులకు విశ్వాసంలేదు" అని విసుక్కున్నాడు. విచారపడ్డాడు నిజమే పాపం గొప్ప హోదాలో ఉన్న ఉద్యోగస్థుణ్ణి తిని తిరుగుతూ ఉండగానే పెన్షను పుచ్చుకోమంటే కష్టంగాదా ?

పెన్షనంటే యేమిటి ? ఏడువందల య్యాభైవచ్చే జీతం రెండువందల యాభైకి దిగడం? ఉద్యోగరీత్యా ఉండే నౌకర్లూడడం. స్వంతంగా పెట్టుకొనే నౌకర్లు తగ్గడం. బంగాళా కాపురం వదలడం. అన్నిటికంటే పెద్ద కష్టం ఒక్కొక్క కలం పోటుతో తాలూకాలను జిల్లాలను యేలిన ఆ దక్షిణహస్తం ముడిచి పెట్టుకొని కూర్చోడం, ఇన్ని విధాల నష్టహేతువైన పెన్షను పుచ్చుకోవడం నా కొకరులేరు నే నొకరికి లేనన్నట్టుగా జీవించడం నిజంగా దుఃఖముగాదా? అయితే తప్పేదేమున్నది

ఆయన జాతకంలో ఉద్యోగాంశ ఎంతదాకా యున్నదో అంత దాకా వెళ్ళిపోయింది.దశాంతరం వచ్చింది. బదిలీదారుడు గూడా వచ్చి పడతాడు.

మేజస్ట్రీటు నుండి తాసిల్దారులోకి తాసిల్దారు నుండి జిల్లా శిరస్తాలోకి శిరస్తాలో నుండి డిప్యూటీ కలెక్టరులోకి అని ప్రమోషన్లు అవుతూవుంటే ఒక్కొక్క మెట్టెక్కి నప్పుడల్లా బంధువులు స్నేహితులూ అభినందనలేఖ లంపుతూవుంటే నిజంగా ఆ కాలం మహోల్లాసకరమైందే కాని ఉన్నతోద్యోగుల అంత్యస్థితిని తలచుకుంటే బహు జాలిగా ఉంటుంది. అందుకనే గదా కొందరు ఆడదాని అయిదోతనం, మగవాడి ఉద్యోగం ఒకటి అని అంటూ ఉంటారు.

రాజేశ్వరరావు పంతులు గుమాస్తా జీవితం ఎట్లా వెళ్ల దోశాడోగాని కొంచెం హోదాగల ఉద్యోగంలోకి వచ్చిన తరువాత ఆయన నడుము వంచి నేలమీాద వస్తువు చేతితో తీసుకోలేదు. చెయ్యెత్తి వంకెమీాది ఉత్తరీయం భుజాన వేసుకోలేదు. అన్నీ నౌకర్లు అందించ వలసిందే. అప్పటి నుంచీ యిప్పటిదాకా ఒక్క విధంగా జరిగిపోయింది.

రాజేశ్వరరావు పంతులు మంచి ఒడ్డూ పొడుగూ గల మనిషి. దానికి తగినట్టుగా విశాలమైన ముఖం పెద్ద పెద్ద కండ్లు ఆయన ఆకృతికి గంభీరాన్ని కూరుస్తుంటాయి. స్వభావంచేత ఆయన మంచి దర్జా పురుషుడు. ఆ స్వభావానికి తగినట్టుగా ఉన్నతోద్యోగి కావడంవల్ల ఆయనధరించే దుస్తులూ ఉపయో

గించుకొనే వస్తువాహనాలు మిక్కిలి ఘనంగా ఉంటాయి. ఆయన యీ జామాజామా వేసుకొని అద్దాల బండి మీదనో స్వారీగుఱ్ఱం మీదనో మోటారు సైకిల్ మీదనో వెళ్లుతూ వుంటే మగవాళ్లే ఎదుట నిలబడడానికి భయపడి చాటుకుపోతూ ఉంటారు ఆయనే గాకుండా ఆయన భార్యా బిడ్డలు గూడా బహు ఠీవిగా ఉంటారు అందఱి యిండ్లలో ఆడవాళ్లవలె వారి ఆడవాళ్లు ఇంట్లో పని చేయరు. అవును, చేయవలసిన పనే మున్నది ? ఇంటి యజమాని ఫెళ్లుమని డిస్ట్రిక్టుకలెక్టరు చేస్తూ వుంటే ఇంట్లో చాకిరి చేసుకున్నదాకా వారికేమి కర్మం ! ఇంట్లో యిద్దరు వంటవాళ్లూ, (సర్కార్యాటుకొకరు, ఇంటి దగ్గిర కొకరూ) నల్గురు పని మనుష్యులూ, పైన సర్కారు బంట్రోతులూ. వీరేనా ? ఆశ్రయింపుకు చేసేవారూ, అభిమానం చేత చేసేవారూ, ఒకరేమిటి లెక్కలేనంతమంది. వారు కాపుర మున్న పెద్ద బంగాళా యీ నౌకరులతోనే కిటకిట లాడిపోతూ ఉంటుంది. ఇక వాళ్ళు అటున్న చెంబు యిటు తీసిపెట్టవలసిన అవసరమేమున్నది.

మేడగాని యింట్లో ఆయనెప్పుడు కాపురం ఉండలేదు. ఇక వారి యింట్లో వస్తుసామగ్రి అంటారా ? విలువైనవి. వింతైనవి. ఏం వుంటాయో అవన్నీ వాళ్ల యింట్లో ఉన్నా యనే అనుకోవచ్చు. వింతవింతైన సోఫాలూ కుర్చీలూ త్రాత బల్లలూ బీరువాలూ నిలువుటద్దాలూ చిత్తరువులూ వారి యింట్లో యే మూల చూచినా కనబడుతూ ఉంటాయి.

రకరకాలు వెండి బంగారు వస్తువులకూ, ముద్దినుసు వస్త్రాలకూ వారిల్లొక పెద్ద భాండారం.

ఈ విధంగా ఉద్యోగాభి వృద్ధితో పాటు నానావిధ భోగాలకు జ్ఞానేంద్రియ కర్మేంద్రియాలతో గూడిన తమ శరీరాన్ని అలవర్చి ఆయనే గాకుండ ఆయన భార్యబిడ్డలుకూడ యింత కాలం నుండి ఒక సుఖమయ రాజ్యంలో జీవయాత్ర చేస్తున్నారు. ఆ భోగానుభవ తన్మయతలో తమ శీవిసం తను కొల్లు కుంగినట్లు కుంచివేయడానికి పెన్షననేది వస్తుందని ఆయన గానీ, ఆయన యింటిలోనివారుగాని యెప్పుడూ యోచించలేదు. రోజు లట్లాగా గడచి పోయినాయి. నేడు ఆకస్మికంగా వచ్చిన పెన్షన్ ఆర్డరు వామనమూర్తి, బలిచక్రవర్తి వైభవాన్ని లాక్కొని పాతాళానికి త్రొక్కినట్లు వారిని త్రొక్కివేసింది.

లోకమెప్పుడూ సుఖదుఃఖద్వంద్వం. ఒకరు యేడుస్తూ ఒకరు నవ్వుతూ ఉంటారు. రెంటినీ సమంగా చూడాలని ప్రతి వాళ్లూ పాటపాడుతూ వుండరు; కాని జ్ఞానచక్షువు లేనివారి కాభావం కలగడంసున్న. ఉద్యోగ సమాప్తికాలం తలుచుకొని రాజేశ్వరరావుపంతులుగారు దుఃఖాన కుములుతూ వుంటే తాశిల్దారు పనిలోనుంచి డెప్యూటీ కలెక్టరు లోకి ప్రమోషనై పంతులు గారికి బదిలీగావచ్చిన ఆ పెద్దమనిషి మహోల్లాసముతో తట్టాబుట్టా కట్టుకొని ముప్పయో తారీఖురాత్రికే

రాధారిబాంగాళాలో విడిశాడు. ఆవర్తమానం వినగానే రాజేశ్వరరావు గారికి మటీ గుండెకొట్టుకోవడం మొదలు పెట్టింది. దాదాపు పాతికవత్సరాలు ఆయనను కప్పిఉన్న అధికారమత్తత ఆముప్పయ్యో తారీఖురాత్రి వదలి పోవడం మొదలు పెట్టింది. ఆయనకు యిప్పటికివెనుక చూపుతగిలింది. ఆయనెప్పుడూ తనసుఖం తనమంచి తన అభివృద్ధి చూచుకో వడమేగాని, యెదుటవాడి కుపకారంచేసి యెఱుగడు. జాలి కూడాచూపియెఱుగడు. కాళ్లుపట్టేవాడిని చాలనడం, పంకా వేసేవాడిని ఆపమనడం, కాగితాలు తెచ్చి నమ్రుడైనిల్చున్న గుమాస్తాను కూర్చోమనడం ఆయన ఉద్యోగ జీవితంలో పరిచయంలేని సంగతులు ఎంతవఱకూ స్వార్థాపేక్షతోనే ఆయన జీవితం గడిచింది. అధికార బలంచేత ఆయన తన ఉద్యోగకాలంలో యెంతమందికో తొందరించి పెన్షన్లుయిప్పించాడు. ఈ కఠినమైన ఆయన ప్రవర్తనకు స్ట్రిక్టుమాన్ అని కొందఱూ, కఠిన చిత్తుడని కొందఱూ, గర్వపోతనికొందఱూ నానా విధాలుగా వ్యాఖ్యానాలుచేస్తూ ఉండేవాళ్లు. అయితే నన్నుగూర్చి యిట్లా అనుకుంటూ ఉంటారనే మాటే ఆయన కెప్పుడూ తోచలేదు. నేను సామాన్య మనుష్య ప్రపంచాని కందని యెత్తులో ఉన్నాననీ నన్ను గూర్చి ఒకమాట అను కోడానికైనా వారి కర్హతలేదని ఆయన ఊహ. అటువంటి తలంపుతో జీవించిన ఉన్నతోద్యోగికి తెల్లవాఱితే ఉద్యోగం వూడుతుందనే ఆరాత్రివేళ మనస్సులో యెంత గాభరాగా

ఉంటుందో చెప్పవలసిందేమిటి? అన్నిటి కంటె నాడు తన్ను బాధిస్తున్న విషయం పెన్షను పుచ్చుకోవడం. కాబట్టి తాను తొందర పెట్టి పెన్షన్లు యిప్పించిన తాబేదార్ల దీనాలాపాలాయన స్మృతిపథానతగలడం మొదలు పెట్టినాయి "అయ్యా పేదవాడిని గంపంత సంసారం, పిల్లలు యింకా మెక్కిరాలేదు. ఇప్పుడే పెన్షను పుచ్చుకుంటే కాపురం గడవదు. ఇంకా యేడాదిపాటు నౌకరీ చేస్తాను. అనుగ్రహించం"డని ప్రాధేయ పడడం తాను టట్ వల్లకాదని నిరాకరించి ఆయన హృదయాంతరాళంలో ఆ నిశ్శబ్ద నిశాసమయ మందు స్పష్టంగా వినపడడం మొదలు పెట్టాయి. గ్రామఫోనులో పలికించినట్లుగా ఈ పాత కథలన్నీ పలుకుచున్న వారెవ్వరు? అతడు నలుదిక్కులా పరికించి చూచాడు. అంతయు శూన్యము. మనుష్యుని కయిష్టమైన పదార్థం కంటికి కనబడితే కళ్ళు మూసుకోవచ్చు, చెవికి వినబడితే చెవులు మూసుకోవచ్చు, ఒంటికి సోకితే ఒడలు మూసుకోవచ్చు. కాని యేమిలాభం? ఆయన కిప్పుడు తోచుచున్న శబ్దాలు. ఆకారాలు బాహ్యాం నుండివచ్చినవి కావు. హృదయ కుహరంలో నుండి ఉద్భూతమైనవి. వాటి కాత డెక్కడ దాగుతాడు. "అయ్యో! నా కాళ్లవేళ్ళంబడి బ్రతిమిలాడిన ఆస్వాల్పోద్యోగులలో నేను ఒకడనైనాను. వాళ్లే నన్నిప్పుడు సూక్ష్మరూపాలతో వెక్కిరిస్తున్నారు ఇక నేనెట్లా జీవించడం? నాకే విధంగా గౌరవం ఉండబోతుంది? ఆ స్వామీ! నాకీ అధికార

నిషా దిగక మునుపే నీ సాన్నిధ్యానికి తీసుకుపోతే బాగుండేది హా... ఉన్నతోద్యోగమా ! నీలో యింత దావాగ్ని ఉన్నదా హా... ... తెలుసుకోలేదు. "అని రాజేశ్వరరావుపంతు లారాత్రి వేళ విచారం మొదలు పెట్టాడు. మనుష్యుల కష్టసుఖాలతో కాలానికి పనిలేదు. అది ప్రపంచపు సుఖసంతోషాలను అంటీ ముట్టకుండా ప్రపంచ ప్రాణులను మాత్రం తనతో బాటు యీడ్చుకపొయ్యే పరబ్రహ్మ స్వరూపం. తెల్లవారితే అధి కారం పోతుండే యీరాత్రి యిట్లాగే నిలువ బడితే బాగుండు నని రాజేశ్వరరావుపంతులు భావిస్తూఉన్నా వినక కాల చక్రం ప్రొద్దుపొడిపించి తీరింది.

రాత్రి అంతా నిద్రలేక పోవడంచేత ఉస్సురస్సురంటూ పక్కమీద నుంచిలేచి రాజేశ్వరరావు పంతులుగారు కాల కృత్యాలు తీర్చుకొని కాఫీత్రాగి దాదాపు యెనిమిది గంటలకు కచ్చేరి సావటిలోకి వచ్చారు. కాని పూర్వపు కళాకాంతులు యేమూలా కన్పడలేదు. నౌకర్లంతా క్రొత్తకలెక్టరుగారి పనుల సరఫరామీద వెళ్ళిపోయినారు. సావట్లో ఒక్క బంట్రోతు లేడు. అంతా బావురు మంటున్నది. నలుమూలల పరచియున్న కుర్చీలు, బల్లలు, బీరువాలు, పెట్టెలు, కాగి తాలు. పుస్తకాలు మొదలైన ఆఫీసుసామానులన్నీ ఎప్పటట్లే ఉన్నా అవన్నీ తనకు వీడ్కోలాసంగు చున్నట్లే ఆయనకు తోచింది. అయ్యో హోదా పోయిన బ్రతుకు యిట్లాగే ఉం

టుంది కాబోలునని నిట్టూర్పు విడిచాడు. అయిదు నిమిషా లిట్లా గడచిపోయినాయి. పంతులుగారు యేమీ తోచక అటూయిటూ పచార్లు చేస్తున్నారు. ఇంతలో పంతులుగారికి బదిలీగా వచ్చిన అవధానిగారు బిళ్ళ బంట్రోతులు యిరుపార్శ్వ ముల నడుస్తూ ఉండగా పంతులుగారి దర్శనానికి వచ్చారు. ఆయనను చూడగానే పంతులుగారి ముఖం వెలవెల పోయింది. అప్పుడే పుట్టిమునిగి పోయినట్టు వచ్చాడని లోలోపల కొంచెం విసుక్కొని యింటికి వచ్చిన పెద్దమనిషిని మర్యాదచేసి కుర్చీలో కూర్చోబెట్టి తాముగూడా కూర్చున్నారు. పరస్పర సంభాషణల్లో ఆనాడు తిథివార నక్షత్రాలు బాగున్నాయనీ ఆపూట వర్జంలేదనీ అప్పుడే చార్జీ యివ్వమనీ క్రొత్తకలెక్టరు గారు తమ అభిప్రాయం వెళ్ళబెట్టారు "ఒకనాడు నేనూ యిట్లాగే అఘోరించా. ఆ తిథివార నక్షత్రాలే నేడు నాకు మంచివి కాకుండా పోయినాయి" అనుకొని రాజేశ్వరరావు పంతులుగారప్పుడే చార్జీ పుచ్చుకోడానికి గొంతు మీద వచ్చి కూర్చున్న కలెక్టరుగారిని చూచి కటకట బడ్డారు. ఈయన కటకటతో ఆయన కేమి పని? మధ్యాహ్నమనీ సాయంత్ర మనీ రాజేశ్వర రావు పంతులుగారు అనుపులు పెట్టినా ఆబదిలీ ఉద్యోగి వదలిపెట్టక పంతులుగారివల్ల మంచి సమయంలో ఒక కాగితం పుచ్చుకొని తన గిలి తీర్చుకొని చక్కా వెళ్ళాడు. ఆ సమయంలో ఉన్నతోద్యోగాల ఆరంభ విరామాల సంతోష దుఃఖాలు ఆ ఉద్యోగుల యిరువురి మొఖాన కన్పట్టినవి.

పొయ్యే ఉద్యోగం ఒకపూట ఆపుకుంటే మాత్రం వరిగే దేమిటని రాజేశ్వరరావుగారు తెంపు చేసుకొని ఆ మధ్యాహ్నం వెళ్ళి చార్జీపూర్తిగా ఒప్పజెప్పి యింటి కొచ్చారు. పాతి కేండ్లకీ మధ్య వెంట బంట్రోతు లేకుండా యింటి కొచ్చిం దాపూటే. ఆ రావడం ఆయనకెంతో కష్ట మనిపించింది. లోకమంతా మామూలుగానే ఉన్నా అనుద్యోగియగు తన్ను లోకమంతా నిర్లక్ష్యం చేస్తున్నట్లు ఆయనకు తోచింది అందువల్ల వంచిన తలయెత్తకుండా వచ్చి యింట్లోపడ్డాడు. మనస్సు స్థిమితంగా ఉండనందున ఆ సాయంత్రం క్లబ్బుకు గూడా వెళ్ళలేదు. ఎవరో యెఱిగిన వారు ఒకరో యిద్దరో యింటి వద్దకేవచ్చి మాట్లాడి వెళ్ళారు.

పనితొందర యేమీ లేకపోవడంచేత రాత్రిభోజనాలు తొందరగానే అయినాయి. ఎవరితోనూ మాట్లాడేటంత ఉల్లాసంగా ఉండనందున రాజేశ్వరరావు పంతులుగారు భోజనం కాగానే వచ్చి తన గదిలో పక్కమీద పడుకున్నారు. ఉద్యోగం పోతుందనే దిగులుతో గూడినరాత్రి గడచినరాత్రి. పోయిన తరువాత గడప వలసినరాత్రి యిది. అత్యంత హృదయ వేదనాపూర్వకమైన యీరాత్రులు ఆయనజీవితంలో యెప్పుడూ చవిచూచినవిగావు. ఇంతకాలం ఏకఛక్రిగా అధికారం చలాయించిన తరువాత నీకు కలిగేదేమిటి ? మిగిలిందేమిటి ? మంచా ? చెడ్డా ? ఒకమాటు యోచించుకోమని అంతర్వాణి యేదో పలికినట్లయింది. ఆమాట తలుచుకోగానే

ఆయనబళ్లు జల్లుమన్నది.ఆయన తన ఉద్యోగకాలంలో యెవరికీ ఉపకారం చేయలేదు.దయజూపలేదు. కొంతమందికి సస్పెన్షన్లు కొంతమందికిడిస్మిస్‌లు,కొంతమందికిఉద్యోగాలు తగ్గించడం, కొంతమందికియింక్రిమెంట్లుబిగపట్టడం,కొంతమందికి పెన్షన్లూడ గొట్టడం, కొంతమంది కధిక శిక్షలు వేయడం, ఒకటేమిటి అనేక విధములుగా అసంఖ్యాక ప్రజాహృదయాలను క్షోభ పటిచాడు. పరార్థములను భంగపరిస్తేనేగాని స్వార్థం ఫలించదు స్వార్థం పోగొట్టుకుంటేనేగాని ప్రజానురాగం లభించదు అప్పటి ప్రయోజనాల కొఱకు ప్రజలను ధిక్కరించి స్వప్రయోజనం చూచుకొన్నాడాయన. అధికారం ఉన్నన్నాళ్లూ దానిలోపమేమీ ఆయనకు కన్పడుటలేదు. కాబట్టి తన పనులనుగూర్చి ఆయనెప్పుడూ నెమరు వేసుకోలేదు అయితే ఆహోదా తొలగి పోయిన నాటిరాత్రివేళ తానూ ఒక సామాన్య మనుష్యుడై పోయిన సమయంలో నీకు మిగిలిందేమిటి ? మంచా? చెడ్డా? అని అంతర్వాణి ప్రశ్నిస్తూ వుంటే అటకమీద దాగిఉన్న దొంగల్లాగ ఏమూలనో పడివున్న అధికార దుర్వినియోగ చిహ్నలన్నీ విస్ఫుటాకారాలతో ఆయన మనోవీధిని పొడకట్టడం మొదలు పెట్టాయి తాను చేసిన అకృత్యాలన్నీ తనలోనే దాగి ఉన్నాయనీ అవి తన మీద విజృంభిస్తాయనీ ఆయనెప్పుడు వూహించలేదు. ఇంత కాలంనుండి యేబలంచేత అవి అణిగి ఉన్నాయో ఆ ఉద్యోగ బలం పోయిన తరువాత ప్రతి ఒక్కటీ ఎదుటికొచ్చి "నీవానాడట్లా దుఃఖపెట్టావు. ఇట్లాదుఃఖపెట్టావు. ఇప్పుడు నీహోదా

పోయింది. నీ వైభవంపోయింది. ఇక నీ గొప్పేమిటి! అందరితో బాటువాడవే నీవూను అయ్యా! అందుకనే ఎంత ఉన్నతాధికారం వచ్చినా నేనూ ప్రజల్లో ఒకడనే అనేమాట మఱచి పోగూడదయ్యా" అని కిలాకిలా నవ్వడం మొదలు పెట్టినాయి. ఆ వికృత హాస్యాలకు రాజేశ్వరరావుగారి హృదయం జలదరించడం మొదలు పెట్టింది. అన్నిటికంటె ఒక దృశ్యం ఆయన యేవిధంగా మఱచి పోదామనుకున్నా మఱవ లేకుండా ఉన్నాడు. తాను డివిజనల్ మేజస్ట్రేటుకోర్టు న్యాయ పీఠాన కూర్చొని ఉన్నాడు. ఎదుట ఒక అపరాధి నిలువ పెట్టబడ్డాడు. అతడు ప్రజాహితమతియగు నొక దేశారాధకుడు. ఆయన ముఖము సుప్రసన్నమై ఉన్నది. ఉత్ఫుల్లనేత్రాలు శాంత తేజములను వెదజల్లుచూ ఉన్నవి. ప్రజలు నిండారు భక్తితో సమర్పించిన పరిమళకుసుమదామం కంఠ సీమను శోభిల్లుతున్నది. ప్రజా హృదయమును చూరగొన్న ఆస్వార్థ త్యాగికి వెలుపలనున్న ప్రజలు జయ పెట్టుచున్నారు. ఇతడెంత గుంపును కూడగట్టుకొనివస్తేనేమి? నాచేతిలోనివాడు అని అప్పుడు తనకు గల్గిన తలంపుకాన ఆ అపరాధివంక నిశితంగా చూస్తూ "మూడేళ్ళు కఠినశిక్ష" అన్నాడు తాను. శిక్ష విని అపరాధి ఒక్క చిఱునవ్వు నవ్వాడు. శిక్షకు వెఱపులేదు. కష్టపాటుకు చింతలేదు. ఏమిటీనవ్వు? తనకు ఒళ్లుమండి పోయింది. వేయి రూపాయలు జుల్మానా అన్నాడు తను. దానికిని అపరాధి ప్రత్యుత్తరము మధుర మంద హాసమే. తన

అధికారమును తృణీకరించుటగా ఆనవ్వు యొక్క తాత్పర్య మని తనకు తోచింది. కాబట్టి అతనిని యింకను వంచనచేయ నెంచి యితనికి కోర్టులోనే సంకెళ్లువేసి తీసుకుని పొండని పోలీసులకు ఉత్తర్వు చేశాడు తాను అక్షేజరిగింది. అప్పటికిని అదేశారాధకుని మోమున దైన్య మగుపించలేదు. న్యాయ స్థానమునకు వెలుపలనున్న ప్రజలు ఆ శిక్షావిధానమును విని తన్ను తలచి కటకటబడి అతని కొఱకు కన్నీరు విడిచారు. అయితే ఆనాడా విషయం తన హృదయంలో యేమాత్రము వేదన కలిగింపలేదు. ఉద్యోగబల మానాడు అభేద్యభిత్తికై వెలుపలి విషయములేమియు ఆయనకు కన్పడకుండా చేసినది నేడాభిత్తిక కూలిపోయింది. తాను వారు ఇప్పుడొక్కచోట నిలువబడ్డారు. ఒకరి మొఖం ఒకరికి విశదంగా కన్పడు తున్నది అయితే వాళ్ళిప్పుడు తన్నేవిధంగా చూస్తున్నారు...... హా. హా... ఆప్రజాహితమతియగు దేశారాధకుని మూడేండ్ల శిక్షాకాలం పూర్తిఅయింది! అతఁడు రేపోమాపో బంధ విముక్తుడై అసంఖ్యా ప్రజాహృదయంలో తాను నిక్షేపించి పోయిన ప్రేమమధువును చేరలతో జుఱ్ఱుకుంటాడు. ఆహా! ఎంత భాగ్యశాలి ఆ అపరాధి! తానిప్పుడు ఉద్యోగ విముక్తుడై నాడు; కాని ప్రజలను మనసార ఆలింగన మొనర్చుకోడానికి తాను వారి హృదయాల్లో కంటకాలను గ్రుచ్చి ఉండగా ఎట్లాసాధ్యమౌతుంది? హా... ...హా.

ఈ విధాలోచనలు మనస్సున పాడకట్టిన కొద్దీ అతని మనస్సు సంక్షుభిత సాగరమువలెనే వేదన తరంగాలతో కొట్టుకోడం మొదలు పెట్టింది. ఇందువల్ల చాల రాత్రివరకాయనకు నిద్రేలేదు కానీ యెట్లాగో కలవరంతో గూడిన ఒక్కకూనుక్కు పట్టింది. కాని గాలిలేక పోవడంచేత ఒళ్ళంతా చెమటపోసి మెలకువ వచ్చింది. ఎప్పటివలెనే "అరే, సుబ్బా! వెధవా! పంకా లాగకుండా నిద్రపోతున్నావట్రా! హుం... ... ..." ఇంతలో తన ఉద్యోగం పోవడంచేత పంకా నౌకరుకూడా పోయినాడనీ అందువల్ల అహర్నిశలు విరామం లేకుండా వీచే పంకాకట్టువడి పోయిందనీ జ్ఞాపకం వచ్చింది. 'అయ్యో' అని పెదవి కఱచుకొని ఒక్క నిట్టూర్పు విడిచాడా ఉన్నతోద్యోగి.

రాజేశ్వరరావు పంతులుగారు నౌకర్ను వేసిన కేకకు అవతల మంచం మీద పిల్లవాడిని పెట్టుకొని పడుకొనిఉన్న రమణమ్మగారికి మెలకువ వచ్చింది. "నౌక రెక్కడున్నాడు? కలవరిస్తున్నారా?" అన్నది. సిగ్గుచేత ఆయన భార్యకు బదులు పలకకుండా 'నౌకర్లను, చాకిర్లను, పెట్టుకోడం కూడా ఒకప్పుడు బంధహేతువే. లేకపోతే అసంఖ్యాకమానవకోటి తమ జీవితములో యెప్పుడు పంకా మొఖమే యెఱుగకుండా జీవిస్తూఉండగా నాకెందుకీబాధ! అని తలచెడు నేత్రాలు అశ్రుసిక్తములైనాయి కాబోలు. తువ్వాల కండ్లమీద పెట్టుకొని పక్కకొత్తిగిలేడు.